

చక్రాలమడుగు ఆక్రమణపై విచారణ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రాజంపేట

చక్రాలమడుగు కబ్జాలపై ఇరిగేషన్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. 'చక్రాలమడుగుపై కబ్జా గొడుగు' అనే శీర్షికతో ఈ నెల 14వ తేదీన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు కడప-చెన్నై జాతీయ రహదారిలోని నయారా పెట్రోల్ బంకుకు ఎదురుగా ఉన్న వాటర్ ప్లాంట్‌కు పక్కన మడుగును ఆక్రమించి అక్రమ నిర్మాణానికి సిద్ధంగా ఉన్న స్థలాన్ని ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ మధుసూదన్ సందర్శించారు. ఆక్రమణ స్థలాన్ని పరిశీలించారు.



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఇ మధుసూదన్

ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?

- మూడేళ్ల వ్యవధిలో 36 కేసులు నమోదు
- ఈ ఏడాది ఫారెస్ట్ పరిధిలో ఐదు కేసులే!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడం సవాల్‌గా మారింది. జిల్లాలో ఫారెస్ట్, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంయుక్తంగా ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధంపై సీరియస్‌గా దృష్టి సారించాయి. ఫలితంగా 2023 నుంచి 2025 వరకు నమోదైన 36 కేసుల్లో 105 మంది స్మగ్లర్లను అరెస్టు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. జిల్లాలో ఒకప్పుడు ఎర్రచందనం స్మగ్లర్ల అడ్డూఅదుపు లేకుండా సా..గుతూ పోలీస్, ఫారెస్ట్, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ బృందాలతో కూడిన జిల్లా అధికార యంత్రాంగాన్ని ముప్పుతిప్పలు పెట్టేది. మూడేళ్ల వ్యవధిలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను గణనీయంగా తగ్గుముఖం పట్టించడంలో జిల్లా అధికార యంత్రాంగం చేసిన కృషిపై సందేహాలు, సంశయాల మధ్య సంపూర్ణాశ్చర్యాలతో కూడిన ఫలితాలను రాబట్టడం విస్మయాన్ని కలిగిస్తోంది.

కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని శేషాచల అటవీ పర్వత ప్రాంతంలో ఎర్రచందనం వృక్షసంపద విస్తరించి ఉంది. ఉమ్మడి కడప జిల్లా అటవీ శాఖ పరిధిలో మూడు లక్షల హెక్టార్ల విస్తీర్ణాన్ని కలిగి ఉంది. విభజిత కడప జిల్లాలో దశాబ్దాల తరబడి ఒంటిమిట్ట, సిద్దవటం, బాజీపేట, మైదుకూరు, దువ్వూరు, పోరుమామిళ్ల మండల అటవీ ప్రాంతాల మీదుగా ఎర్రచందనం స్మగ్లింగ్ పెద్దఎత్తున సాగుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఎర్రచందనం వృక్ష సంపదను సంరక్షించుకోవడంలో భాగంగా జిల్లాలోని పోలీస్, ఫారెస్ట్, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కూడిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. మూడు శాఖలతో కూడిన అధికారులు దశాబ్దాల తరబడి ప్రత్యేకంగా నిఘా వేసి ఎర్రచందనం స్మగ్లర్ల అనుపానులను తెలుసుకుని సీరియస్‌గా దాడులు చేస్తున్నారు. ఫలితంగా మూడేళ్ల వ్యవధిలో చేసిన దాడుల్లో పట్టుబడిన ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకోవడం, ఎర్రచందనం దుంగలను, వాహనాలను సీజ్ చేస్తూ ముందుకు సాగుతున్న నేపథ్యం అందరికి తెలిసిందే.

సంయుక్త నిఘా.. తగ్గిన స్మగ్లింగ్!

జిల్లాలోని ఎర్ర చందనం నిఘా బృందాలు నిరంతర దాడులు, కేసులు, అరెస్టుల పరంపరతో ముందుకు సాగుతున్నాయి. ఫలితంగా 2023 నుంచి 2025 వరకు మూడేళ్ల వ్యవధిలో 36 కేసులు నమోదు చేయడం, 19 వాహనాలు, 105 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకోవడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 10 కేసుల్లో 23 మందిని అదుపులోకి తీసుకుంది. మూడు వాహనాలు, 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 21 కేసుల్లో 71 మందిని అదుపులోకి తీసుకుని, 10 వాహనాలు, 299 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. 2025-26 ఆర్థిక



సంవత్సరంలోని 10 నెలల వ్యవధిలో నమోదైన ఐదు కేసుల్లో 11 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకుంది. మూడు వాహనాలు, 181 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ఒంటిమిట్ట, బాకరాపేట ప్రాంతాల్లో రెండు దఫాలుగా సుమారు 8468 ఎర్రచందనం దుంగల చొప్పున స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

చెన్నయ్ టు ఢిల్లీ

జిల్లాలోని ఎర్రచందనం బృందాల దాడుల్లో పట్టుబడిన వారిలో తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు, కూలీలు అధికంగా ఉంటున్న సంగతి తెలిసిందే. తాజాగా పంజాబ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో చాలా వరకు పూట గడవని వ్యక్తులే కార్మికులుగా వచ్చి పట్టుబడుతున్నట్లు అధికారులు గుర్తించడం గమనార్హం. వీరికి స్థానికంగా ఉంటున్న వ్యక్తులు ఆహారాన్ని అందించడానికి అటవీ విహారం ముసుగులో వచ్చి అందిస్తున్నట్లు తెలుస్తోంది.

నిరంతర పెట్రోలింగ్..పక్కా ప్లానింగ్

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి నిరంతరం నిఘా, నైట్ పెట్రోలింగ్, ఆధునికీకరించిన ఆత్మరక్షణ ఆయుధాలతో ముందుకెళ్తుండడంతో స్మగ్లింగ్ తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. అడవుల్లో ఏర్పాటు చేసిన బేస్ క్యాంపులు, ట్రెంచ్ సహాయంతో స్మగ్లింగ్ నిరోధానికి ఆయుధాలుగా వాడుతున్నట్లు తెలుస్తోంది. అవసరమైన సమయాల్లో పోలీస్, టాస్క్‌ఫోర్స్ సహాయం తీసుకోవడం ద్వారా గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నట్లు అధికారులు పేర్కొంటుండడం గమనార్హం. పోలీసులు జిల్లాలోని దువ్వూరు మండలానికి చెందిన ఓ స్మగ్లర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారు.

ముమ్మరంగా పెట్రోలింగ్

జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించడంలో భాగంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. నిరంతర నిఘా వేయడం వల్ల లభించిన సమాచారం ఆధారంగా ప్లానింగ్ చేయడం వల్ల స్మగ్లింగ్‌కు ముకుతాడు వేయగలిగామని అనుకుంటున్నాం

- వినీత్‌కుమార్, డిఎఫ్ఒ, కడప.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

విద్యా, వైద్య, శిశు సంక్షేమ శాఖలు ముఖ్యమైనవని, వీరంతా కలసి సమన్వయంతో పని చేస్తేనే సత్ఫలితాలు దిశగా జిల్లాను ముందుకు తీసుక వెళ్లగలమని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సుధా కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ 'ఆరోగ్యవంత మైన మహిళా - శక్తి వంతమైన కుటుంబానికి బలమైన పునాది' అనే అంశంతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జిల్లా లో ఒక నెల పాటు నిర్వహించి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో ప్రతి రాష్ట్రం, ప్రతి జిల్లాలో జరుపుకోవడం జరుగుతుందన్నారు. దీని ముఖ్య ఉద్దేశం ప్రతి సంవత్సరం ఒక్కొక్క థీమ్స్ మీద ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. పిల్లలలో ఉబకాయం ఉండడం, మనం తినే ఆహారంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండడం వల్ల ఏ విధంగా ఆరోగ్య సమ స్యలు రావచ్చునే అంశంపై ఈ సంవత్సరం థీమ్ పెట్టడం జరిగిందని తెలిపారు. నెల రోజులు పాటు 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చక్కగా నిర్వహించిన జిల్లా సిబ్బంది, అంగన్వాడీ



పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

కార్యకర్తలకు కలెక్టర్ వారిచే మొమెంటో లను అందించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం పౌష్టికాహారం స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమం లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ హైమవతి, నగరపాలక సంస్థ కమిషనర్ రవి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరమ్మ, జిసిడిఒ మాధవి, అంగన్వాడీ, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ డేవిడ్‌కుమార్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని స్థానిక ఏరియా ఆస్పత్రిలో థైరాయిడ్ వ్యాధి గ్రస్తురాలకు గురువారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో అరుదైన చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ డేవిడ్ సుకుమార్ మీడియాతో మాట్లాడుతూ రాయచోటి ప్రాంతానికి చెందిన శారదమ్మ అనే మహిళ గొంతు కింద గడ్డలతో బాధపడుతూ నాలుగు సంవత్సరాల నుంచి పలు ప్రయివేట్ ఆసుపత్రులలో వైద్యం పొందుతున్నప్పటికీ ఆమె గడ్డకు సరైన వైద్యం అందక నొప్పితో బాధపడుతు ఉండేవారని తెలిపారు. చివరి ప్రయత్నంలో భాగంగా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారని తెలిపారు.డాక్టర్ శైలేష్ ఆమె ఆరోగ్య స్థితి గతులు తెలుసుకొని సీనియర్ వైద్యులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ వద్దకు తీసుకువెళ్లి పరీక్షలు చేసి థైరాయిడ్ గడ్డగా నిర్ధారించి ఆమెకు ఆపరేషన్ చేయాలని సూచించారు.మత్తు మందు వైద్యులు శివ,అనిల్, ఇతర వైద్యులు నరసింహారావు, వంశీతో పాటు ఆసుపత్రి ఒటి సిబ్బందితో కలిసి సుమారు మూడు నుంచి నాలుగు గంటలు పాటు శ్రమించి చికిత్సను విజయవంతం చేశారని చెప్పారు. ఇలాంటి ఆపరే షన్ చేయడం ఇక్కడ ప్రథమమని పేర్కొన్నారు. ఆపరేషన్ చేయడానికి అన్ని సౌకర్యాలు కల్పించిన సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత నాలుగేళ్లుగా ఎన్నో ఆసుపత్రుకు తిరిగినప్పటికీ సరైన వైద్యం అందించలేదని, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు వ్యాధిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించి ఆపరేషన్‌ను విజయంతంగా నిర్వహించారని రోగి బంధువులు హర్షం వ్యక్తం చేశారు. వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు

ఘనంగా అంతర్జాతీయ అనస్థీషియా దినోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం అంతర్జాతీయ అనస్థీషియా(మత్తుమందు) దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అనస్తీషియా డాక్టర్ వెంకట శివ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సిఎంఒ డాక్టర్ కిరణ్ కుమార్, అనస్థీషియా డాక్టర్ అనిల్ కుమార్, వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట శివ మాట్లాడుతూ 1837-1901 విక్టోరియన్ కాలంలో ఆపరేషన్ అంటే భరించరాని నొప్పితో అత్యంత క్రూరంగా ఉండేదన్నారు. బ్రిటన్‌కు చెందిన సర్జన్ రాబర్ట్ లిస్టన్ 1840లో లండన్‌లోని యూనివర్శిటీ కాలేజ్ ఆసుపత్రిలో చేరి కేవలం 25 సెకన్లలోనే ఆపరేషన్లు చేసే వారన్నారు. శస్త్రచికిత్స సమయంలో నొప్పితో అరుస్తున్న రోగులను అక్కడుండే సహాయ కులు చెక్క బల్లకు అదిమి పట్టు కునే వారన్నారు.1845లో హోరేస్ వెల్ అనే దంత వైద్యులు నైట్రస్ ఆక్సైడ్ గ్యాస్ ఉపయోగించి నొప్పి లేకుండా రోగి పన్ను తొలగిస్తానని బోస్టన్‌లో ఒక ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారని కానీ ఆ ప్రయత్నం విఫలమైందన్నారు. 1846 అక్టోబర్ 16వ తేదీన విలియం మోర్టన్ అనే దంత వైద్యుడు బోస్టన్ నగరంలో అనస్థీషియాపై ప్రదర్శన ఏర్పాటు చేశారని, అందుకు ప్రతి ఏటా అక్టోబర్ 16వ తేదీని ప్రపంచ అనస్థీషియా దినంగా జరుపు కుంటున్నామన్నారు. అనస్థీషియా అనేది నొప్పిలేకుండా చేసే ప్రక్రియలను నిర్వహించడానికి వీలు కల్పిస్తుందన్నారు. అనస్థీషియాలో మూడు ప్రధాన రకాలు ఉన్నా యని, వాటిలో ఒకటి లోకల్ అనస్థీషియా, రెండు రీజినల్ అనస్థీషియా, మూడు జనరల్ అనస్థీషియా వివరించారు. వీటిలో ఒక్కో రకమైన శస్త్ర చికిత్స చేసే సమయంలో ఒక్కో రకమైన అనస్థీషియా ఇస్తామన్నారు.. అనంతరం ప్రపంచ మత్తుమందు దినోత్సవం సందర్భంగా కేక్ ను కట్ చేసుకున్నారు. కార్య క్రమంలో నర్సింగ్ సూపరింటిండెంట్ పద్మావతి, హెడ్ నర్సు విజయ కుమారి, స్టాఫ్ నర్సులు కమల, ప్రసన్న, సోని, నాగలక్ష్మీ, ఓటి అసిస్టెంట్లు తులసి, నాగేశ్వరి, గణేష్ పాల్గొన్నారు.

అన్నమయ్య కళావేదిక ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట

స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో సుమారు రూ.2 లక్షల వ్యయంతో దాతల సహకారంతో శ్రీ అన్నమయ్య కళావేదిక నిర్మించారు. ఈ వేదికను గురువారం డిప్యూటీ డిఇఒ ఎల్.నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభా కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.జయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ సమర్థవంతమైన హెచ్ఎం పాఠశాలలో ఉంటే ఈ విధంగా పాఠశాల అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. ఈ వేదిక నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన దాతలు విశ్వనాథ్ నాయుడు, బి.అచ్యుత, ఎ.రమణయ్య, వీరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. సభా కార్యక్రమం అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనాన్నిపరిశీలించారు. భోజనం బాగుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎంఇఒ-1, కె.రఘునాధరాజు, ఎంఇఒ-2 డి. సుబ్బరాయుడు, పుల్లంపేట ఎంఇఒ జి.చక్రధర్ రాజు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న డిప్యూటీ డిఇఒ నాగయ్య

జిఎస్‌టి 2.0తో ప్రజలందరికీ లబ్ధి : కలెక్టర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

జిఎస్‌టి 2.0తో ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పట్టణంలోని శివాలయం సర్కిల్ నుంచి నేతాజీ సర్కిల్ (బంగ్లా) వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కలెక్టర్, టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ర్యాలీ భాగంగా ప్రజలందరికీ జిఎస్‌టి 2.0 వల్ల కలిగే లబ్ధి గురించి అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఒక దేశం ఒక పన్ను అనే సిద్ధాంతంతో కేంద్ర ప్రభుత్వం 2017లో జిఎస్‌టిని ప్రవేశపెట్టిన తరువాత ఇప్పుడు అమలులోకి వస్తున్న జిఎస్‌టి 2.0 దేశంలోని అతిపెద్ద ఆర్థిక సంస్కరణలలో ఒకటని తెలిపారు. దీని ద్వారా 99 శాతం వస్తువులపై పన్ను రేట్లు తగ్గి ప్రజలకు లాభం చేకూరుతుందని వివరించారు. గతంలో 18 లేదా 12 శాతం జిఎస్‌టి ఉన్న వస్తువులకు ఇప్పుడు 5 లేదా 0 శాతం జిఎస్‌టి అమలవుతుందని పేర్కొన్నారు. జిఎస్‌టి రేట్ల తగ్గింపు వల్ల రాష్ట్రానికి సంవత్సరానికి సుమారు రూ.8 వేల కోట్లు ఆదాయం తగ్గినప్పటికీ, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్కరణకు అంగీకారం తెలిపిందన్నారు. ఈ తగ్గింపు వల్ల ప్రజల చేతుల్లోనే డబ్బు మిగిలి, వారందరికీ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. జిఎస్‌టి తగ్గింపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి వారం వేర్వేరు ఇతివృత్తాలతో కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జిఎస్‌టి తగ్గింపు వివరాలను తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా పాత , కొత్త రేట్లు సులభంగా తెలుసుకోవచ్చని, ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం జిఎస్‌టి రేట్లు తగ్గించాయని, ప్రజలందరూ తగ్గిన పన్ను రేట్లను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిటిఒ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జి.రవి, అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సౌమ్య, కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు, పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి :'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం వేగవతంగా అభివృద్ధి జరుగుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ రాయలసీమ ప్రాంతానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాయలసీ మలోని పుణ్యక్షేత్రాల గురించే కాకుండా ప్రజల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారన్నారు. దేశానికి మోదీ, ఏపీకి చంద్రబాబు ఒక వరం లాంటివారన్నారు. వారు ప్రతి నిత్యం అభివృద్ధి కోసం పరితపిస్తున్న నాయకులన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్ కృషితో గూగూల్ ఎఐ డేటా సెంటర్ ను విశాఖకు తీసుకొస్తున్నారన్నారు. ఈ సంస్థ రాకతో ఎపికి ప్రపంచ పటంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రధాన మంత్రి సహకారంతో రాష్ట్రంలో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కోమటివానిచెరువుకు మరమ్మతులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజల ప్రాణాలను, ప్రయాణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో కోమటివానిచెరువు కట్టపై రోడ్డు అధ్వానంగా మారడాన్ని నిరసిస్తూ గురువారం బహుజన యువసేన నాయకులు రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. ఈ సందర్భంగా బివైయు అధ్యక్షుడు పునీత్ కుమార్ మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డుపై ప్రయాణించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా, నిధులు లేవనే సాకులు చెప్పి, రోడ్డు మరమ్మతు విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల క్షేమం కోసం స్వచ్ఛందంగా కోమటివాని చెరువు రోడ్డును తాత్కాలికంగా పూడ్చే పనులను ప్రారంభించామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో మా యువసేన సభ్యులు, శ్రేయోభిలాషుల సహకారంతో సొంత నిధులతోనే ఈ రోడ్డుకు పూర్తి మరమ్మతులు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు జిలాని భాష, రెడ్డిశేఖర్ రెడ్డి, హరికృష్ణ, వినయ్, ఆది, కర్ణ, లోకేష్, ఉదయ్, కుమార్, సాయికిరణ్, మనీష్, జగదీష్, సంతోష్, ఉమామహేశ్వర్, రాజేష్ పాల్గొన్నారు.

రెండు రోజులు ఒఎస్ఆర్ శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: రాయచోటి ఎంపిడిఒ సభా భవనంలో అక్టోబర్ 17, 18వ తేదీల్లో రెండు రోజులపాటు ఒఆర్ఎస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మండల స్థాయి శిక్షణ శిబిరం నిర్వహింప బడుతుందన్నారు. కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు తప్పని సరిగా హాజరుకావాలని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి జిల్లాలో జరిగిన అండర్-19 విద్యార్థుల క్రీడాపోటీలలో హ్యాండ్ బాల్ విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు సిఇసి కుసుమ, సెరికల్చర్ నవ్య తేజ, ఎంపిసి రోహిణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు పీడీ మురళీధర్‌రెడ్డి ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని అందించడం జరుగుతుందన్నారు.కళాశాలలో మూడు రోజులుగా విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. లెక్చరర్ బాలరాజు ఆధ్వర్యంలో విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలను తొలగించి వాటి స్థానంలో పూల మొక్కలను, ఇతర మొక్కలను నాటి శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. రానున్న పబ్లిక్ పరీక్షలకు అవసరమైన ముఖ్యమైన ప్రశ్నలను వాటికి సంబంధించిన విశ్లేషణ, జవాబులు రాసే విధానాన్ని ప్రత్యేకంగా చేపట్టి విద్యార్థినులకు శిక్షణ ప్రారంభించామని, జిల్లాలో గత మూడు ఏళ్లుగా పరీక్షా ఫలితాలలో, క్రీడలలో విద్యార్థినులు మొదటి స్థానంలో నిలవడానికి చర్యలు చేపట్టి మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-రాజంపేట : కొత్త బోయినపల్లిలో శ్రీ గంగమ్మ దేవస్థానంలో గంగమ్మ జాతర ఉత్సవం నిర్వహించారు. గురువారం యల్లటూరు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మేరువ సుబ్బరాయుడు, మేడా జానకి రామయ్య, నల్ల బాబు, బొడిచెర్ల సుబ్బరాయుడు, పొట్టు శంకరయ్య, మేడా శ్రీకాంత్, ద్వారక, మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మౌలా, గాజుల కులాయప్ప పాల్గొన్నారు.



విధాత చిత్రంలోని ఓ సన్నివేశంలో నటులు

మనస్సును హత్తుకునేలా 'విధాత' చలనచిత్రం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రతి ప్రేక్షక హృదయాన్ని విధాత చిత్రం మనస్సును హత్తుకునే విధంగా ఉంటుందని ఎబిసి ప్రొడక్షన్స్ అధినేత, చిత్ర నిర్మాత, చిత్ర కథానాయకుడు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కిందన్నారు. ఇంటిల్లిపాది వీక్షించే కుటుంబ కథాచిత్రంగా చరిత్రలో నిలుస్తుందని, విధాత చిత్రంతో మదనపల్లె నటులకు చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తెస్తుందన్నారు. సుమారు 50 మంది నటీనటుల అద్భుత ప్రతిభకు ఈ చిత్రం అద్దం పడుతుందన్నారు. ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రచారంపైన ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మొదటిసారిగా మదనపల్లె నేపథ్యంలో చిత్ర నిర్మాణం జరుపుకోవడంతో పాటు, నిర్మాత, దర్శకులు, కథా రచయిత ఇక్కడి వారే కావడం ఈ చిత్రం విజయానికి దోహదపడుతుందన్నారు .ఇప్పటికే విధాత చిత్రంపైన ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోందని, అతి త్వరలో ప్రేక్షక దేవుళ్ళ ముందుకు రాబోతోందన్నారు. ఇందుకుగాను మిగిలిన పనులు శరవేగంగా పూర్తిచేస్తున్నామని, ఈ చిత్రం ద్వారా మదనపల్లికి చెందిన కళామతల్లి ముద్దు బిడ్డలకు అవకాశాలు మెరుగుపడి, రాష్ట్రాల్లో గుర్తింపు లభిస్తుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సినిమా ను థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రేక్షకులు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

'అన్నమాచార్య'లో ఎఫ్‌డిపి పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్య విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "స్థిరత్వం వైపు మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఉద్భవిస్తున్న సాంకేతికతలు' అనే అంశంపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ పోస్టర్‌ను గురువారం అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్ సి.అభిషేక్‌రెడ్డి విడుదల చేసి విసి సాయిబాబారెడ్డికి అందించారు. ఆరు రోజుల జాతీయస్థాయి ఎఫ్‌డిపి నవంబర్ 3 నుంచి 8 వరకు ఆన్‌లైన్ రూపంలో నిర్వహించబడుతుందని అభిషేక్ రెడ్డి తెలిపారు. గెస్ట్ లెక్చరర్లు, దేశంలోని ప్రముఖ ఐఐటిలు, ఎన్ఐటిలుకు చెందిన ప్రొఫెసర్లు, పరిశ్రమ నిపుణులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా బోధకులు శక్తి నిల్వ వ్యవస్థలు, సిఎఫ్‌డి. విశ్లేషణ, బయోపదార్థాలు, యంత్ర అధ్యయన అనువర్తనాలు, హైడ్రోజన్ ఇంధన సాంకేతికత, ఉష్ణ మార్పిడి, అదితివ్ తయారీ, ఎఐఎంఎల్ ఆధారిత తయారీ విధానాలు వంటి ఆధునిక సాంకేతిక అంశాలను లోతుగా నేర్చుకోనున్నారని తెలిపారు. ఈ ఆధునిక పరిజ్ఞానం ద్వారా అధ్యాపకులు తమ బోధనలో సాంకేతికతను సమన్వయం చేసుకొని, విద్యార్థులకు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అందించగలుగుతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఎం. వి.నారాయణ, ప్రిన్సిపల్ బి.జయరామిరెడ్డి, అడ్మిషన్ల డీన్, జి.సురేశ్‌బాబు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, సమన్వయకర్తలు బి.దేవరాజ్ నాయక్, కె.అజయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి


రికార్డులు పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

పారిశుధ్య పనులపై దృష్టి : జడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పనుల నివేదికలు పరిశీలించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీలతో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి సారించి పనులు కుంటు పడకుండా గ్రామాలు శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. తడి పొడి చెత్తలను డంపింగ్ యార్డుకు చేరేటట్లు చూడాలన్నారు. గ్రామాలు ఎక్కడే గాని మురికి కుంటలు చెత్త కనిపించకూడదు సూచించారు. పంచాయతీ సెక్రెటరీ గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రెడ్డయ్య సిబ్బంది పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న చంద్రప్రసాద్

గోపగుడిపల్లి వాసికి నంది పురస్కారం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గోపగుడిపల్లి చెందిన అక్కల చంద్రప్రసాద్‌కు నంది పురస్కారం వరించింది. ఈనెల 15న హైదరాబాద్‌కు చెందిన త్యాగరాయ గాన మహాసభ తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో మండలి బుద్ధ ప్రసాద్ తండ్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చంద్రప్రసాద్‌కు నంది పురస్కారాన్ని ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా రామాపురం మండలం మారుమూల గ్రామంలో ఉన్న తనను హైదరాబాదు మహానగరంలో మండలి బుద్ధ ప్రసాద్ తండ్రి శతజయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నందితోపాటు ప్రశంస పత్రం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి కళా రంగం వైపు ప్రోత్సహించడం తన అదృష్టమన్నారు. తనను హైదరాబాదుకు పిలిపించి సన్మానించిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం హర్షణీయం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆటో డ్రైవర్లు సంబరాలను జరుపుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటో డ్రైవర్లకు రూ.15వేలు వారి అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మండల కేంద్రమైన కలకడ సంత ప్రాంతంలో ఆటో డ్రైవర్లు మొత్తం కలిసి కేక్ కట్ చేసి సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కో-ఆప్షన్ సభ్యులు టిఎస్.ఇనయతుల్లా మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల బాధను అర్థం చేసుకొని వారిని ఆదుకొనే విధంగా ఆటో డ్రైవర్లకు రూ.15లు చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ డ్రైవర్లు పాల్గొన్నారు.


పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న శైలజ

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు సర్పంచ్ ప్యారి జాన్ జావిద్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శైలజ తెలిపారు. పంచాయతీ కార్మికులకు ప్రతి ఏడాది దీపావళి పండుగ సందర్భంగా పంపిణీ చేస్తున్న నిత్యవసర సరుకుల పంపిణీలో భాగంగా గురువారం పంచాయతీ కార్మికులకు అందరికీ వారికి కావలసిన నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్మికులకు కావాల్సిన నిత్యవసర సరుకులైన సోపులు, బట్టలు, చెప్పులు, వంటనూనెలు, తదితర నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వారు పనిచేస్తున్న సమయంలో చేతులకు ఎలాంటి చెత్తాచెదారం, మురికి వంటి పదార్థాలు అంటుకోకుండా గ్లౌజులను సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులు తనిఖీ

ప్రజాశక్తి-సుండుపల్లె : మండలంలోని వాటర్ షెడ్ ద్వారా జరుగుతున్న పనులను గురువారం జిల్లా ఉపాధి అధికారి వెంకటరత్నం పరిశీలించినట్లు మండల ఉపాధి హామీ చట్టం ఎపిఎం మలక్‌బాష తెలిపారు. ఈ సందర్భంగా పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ మండలానికి వాటర్ షెడ్డు ల పనుల్లో రాష్ట్రంలో టి.సుండుపల్లికి మూడవ స్థానం రావడంతో మంచి పరిణామమని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ , రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో మండలంలో జరిగిన వాటర్‌షెడ్ల పనులను చిత్రీకరించేందుకు విజయవాడ నుంచి సంబంధిత శాఖల అధికారులు వచ్చారు. అధికారులతో కలిసి జనసేన నేతలు, వాటర్‌షెడ్ పనులను పరిశీలించారు. రాష్ట్రంలో ఏడు మండలాలను ఉత్తమ పనులు జరిగిన మండలాలుగా గుర్తించడం జరిగిందన్నారు. వాటిలో మారుమూల మండలమైన టి.సుండుపల్లి మండలానికి 3వ స్థానం రావడం చాలా గొప్ప విషయమన్నారు. రివార్డు కింద రూ.20 లక్షలు అదనపు పనులనుకూటమి ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఒ అశోక్, ఎపిఒ మాలిక్‌భాష, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ సిబ్బంది, జనసేన నాయకులు, స్థానిక ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే టోర్నమెంట్ విజయవంతం

ప్రజాశక్తి-నందలూరు : యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ సభ్యులు సమష్టి కృషివలనే దక్షిణ భారతస్థాయి క్యారమ్స్ టోర్నమెంట్ విజయవంతమైందని టోర్నమెంట్ నిర్వాహకులు ఆర్మగం విశ్వనాథ్, బిఎన్ శంకర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి స్థానిక రైల్వే కళాక్షేత్రంలో టోర్నమెంట్ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ ఆటగాడు గురుప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజా హుస్సేన్, వీర, పల్లె గ్రీస్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టిసుధాకర్, నాగభూషణం, జంగంశెట్టి హరిప్రసాద్, రామకృష్ణ,నారాయణ పాల్గొన్నారు.


గురుప్రసాద్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

ప్రజాసమస్యలే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ సమావేశ మందిరంలో మండలం అభివృద్ధి సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల నాయకులు ను గ్రామాల వారీగా పిలిపించి ఆయా గ్రామాల సమస్యలు పైన సుదీర్ఘంగా చర్చించారు. మండలంలోని భూముల రీసర్వే పైన, విద్యుత్ సమస్యల పైన ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని సంబంధిత అధికారులను మూడు నెలల లోపల సమస్యలన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. డిటి సైద్‌బాషా, ట్రాన్స్‌కో డిఇ చంద్రశేఖర్ రెడ్డి, ఎడిఇ శివయ్యలను ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ శాఖలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్లు మార్చడం కోసం రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, అలాంటి చెడ్డ పేరు మండలంలో తేవద్దండని హెచ్చరించారు. అన్ని గ్రామాలలో డ్రైనేజీ కాలువలు, వాటర్ ట్యాంకులు, గ్రామాలకు తాగునీటి బోరు, మోటర్లు వంటి సమస్యలు ఎమ్మెల్యే వద్ద నాయకులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి మా సొంత మండలమని, ఈ మండలంలో అధికారులు ఎలాంటి అవినీతికి పాల్పడవద్దని ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించు కోవడానికి అధికారులు నాయకులతో సమన్వయంగా ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తాము వైసిపి నాయకులు మాదిరిగా ప్రజలకు ఇబ్బందులు పెట్టమని, ఎవరి భూములు అన్యాయంగా లాక్కోమని, ఎవరిపైన దౌర్జన్యాలు చేయడం, అక్రమంగా కేసులు పెట్టడం వంటి సంస్కృతి మా కుటుంబానికి లేదన్నారు. నియోజకవర్గ, మండలాలు అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తామని దీనికి అధికారులందరూ సహకరించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు వంద శాతం అమలు చేస్తున్నాడని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని, అలాగే సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పథకాన్ని కూడా ప్రజల్లోకి నాయకులు అధికారులు తీసుకెళ్లాలని సూచించారు. వాటర్ గ్రిడ్ పనులు కింద రూ.2వేల కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, వాటి ద్వారా కడప జిల్లాలోని గండికోట ప్రాజెక్టు నుంచి గుర్రంకొండ మీదుగా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. కలికిరి పట్టణానికి జరికొన ప్రాజెక్టు నుంచి ఇప్పుడున్న పైపులైన్ రిపేర్ చేయించి మళ్లీ నీరు అందేటట్లు పనులు మొదలు పెడతారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సహకార బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, జంగమ సంక్షేమ సంఘం చైర్మన్ చంద్రశేఖర్, యోగేష్ రెడ్డి, సహదేవ రెడ్డి, సతీష్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, నాగభూషణంరెడ్డి, రమేష్ బాబు, ట్రాన్స్‌కో డిఇ చంద్రశేఖర్ రెడ్డి, ఎడిఇ శివయ్య, ఎంపిడిఒ భానుమూర్తిరావు, డిటి సయ్యద్, అన్ని గ్రామాల సర్పంచులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ దారుణం : 'గడికోట'


మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతుందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు వైద్య విద్య విద్యను దూరం చేయడానికి సిఎం చంద్రబాబు చేస్తున్న కుట్రను ప్రజలకు తెలిపేందుకు రచ్చబండ కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మండలం రాచపల్లె గ్రామంలో జరిగిన వైసిపి రచ్చబండ- కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలకు వైద్య విద్యను చేరువ చేయాలని, వైద్య కళాశాలల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో మాజీ సిఎం వై.ఎస్.జగన్ దృఢ సంకల్పంతో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను చంద్రబాబు కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు పిపిపి విధానం తీసుకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాలలపై ప్రజాభిప్రాయాన్ని కోటి సంతకాల రూపంలో సేకరించి గవర్నర్‌కు అందచేసి, ప్రయివేటీకరణను అడ్డుకోవాలని వైసిపి అధినేత జగన్ కృషి చేస్తున్నాం న్నారు. చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కళాశాలను తీసుకు రాలేకపోయారని, జగన్ ఐదేళ్లలో రెండేళ్లు కోవిడ్‌తో గడచిపోయిననూ, మూడేళ్లలో 17 మెడికల్ కళాశాలలను తీసుకు వచ్చారన్నారు. ఇందులో ఐదింటిని పూర్తి చేసి,మిగిలిన వాటిని వివిధ నిర్మాణ దశల్లో ఉంచారన్నారు. కమిటీల నిర్మాణంతో పాటు పార్టీ అభివృద్ధిపై ఆయన కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. రాబోయే రోజులలో కార్యకర్తల అభిప్రాయం మేరకు జగన్ పాలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, సర్పంచులు వెంకటరెడ్డి, అయోధ్యాపురం నాగభూషన్‌రెడ్డి, మాజీ సింగల్‌విండో అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి,పెద్దిరెడ్డి, నాయకులు మహేశ్వర రెడ్డి, వెంకట్రామ రాజు, వెంకట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ లు గోపాల్ రెడ్డి, చంద్రారెడ్డి, విశ్వనాధరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో ప్రాణాలకు ముప్పు

మదనపల్లె అర్బన్ : కల్తీ మద్యం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని మదనపల్లె నియోజకవర్గంలో గడప, గడపకు వెళ్ళి కల్తీ మద్యంపైన ప్రజలకు అవగాహన, మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ను మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ చేపట్టారు. రామసముద్రం మండలంలో వైసిపి నాయకులతో సమావేశమైన నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ త్వరలో చేపట్టే రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలలో నాయకులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల పిపిపి విధానానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తన ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టి కూటమి ప్రభుత్వాన్ని దోషిగా నిలుపాలన్నారు. వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పివి.మిథున్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి పాలన వైఎల్యాలు తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంపై చొరవ చూపాలి

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల


జీవన ఎరువులపై రైతులుకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలికిరి

జీవన ఎరువుల వాడకంపై రైతులు చొరవ చూపాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జీవన ఎరువుల వాడకంపై చర్చ, అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన ఎరువులైన అజోల్లా, రైజోబియం, అజటోబాక్టర్, ఫాస్ఫేట్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం విడుదల బ్యాక్టీరియా వంటి వాటిని పంట పొలాల్లో ఉపయో గించి పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను అందించవచ్చునని తెలిపారు. డాక్టర్ కె విశ్వనాథ్ మాట్లాడుతూ అజోస్పైరిల్లమ్ జీవన ఎరువు వరిలో పనిచేసే విధానాన్ని, రైజోబియంను వేరుశనగ, అపరాల పంటల్లో వాడడం ద్వారా నత్రజనిని పంటలకు అందుతుందని తెలిపారు. ఫాస్ఫేట్ సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియా ద్వారా వేరు వ్యవస్థకు భాస్వరం అందుతుందని, భూమిలో ఉన్న పొటాషియం మొక్కలకు అందేటట్లు పొటాషియం విడుదల బ్యాక్టీరియా సహకరిస్తుందని సూచించారు. కెవికెలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా వరి పంట సాగు చేయడంలో పాటించిన వివిధ సేంద్రియ పద్ధతుల గురించి సమన్వయకర్త .మంజుల వివరించారు. తదుపరి కెవికె క్షేత్రంలోని కోత దశలో ఉన్న సేంద్రీయ వరిని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పి.రామకృష్ణరాజు, కెవికె శాస్త్రవేత్తలు ఎస్ .సోమశేఖర్ బాబు, డాక్టర్ కె.మాధురి, డాక్టర్ వై. పీరు సాహెబ్, డాక్టర్ శ్రీనివాసులు, కెవికె సిబ్బంది , రైతులు తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న స్వాతి చక్రపాణి

కేన్సర్ వ్యాధిగ్రస్తుడికి చేయూత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ వ్యాధిగ్రస్థుడికి ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ స్వాతి చక్రపాణి ఆపన్న హస్తం అందించి ఆదుకున్నారు. చిన్నమండ్యం మండలం, కొండమూలకి చెందిన నాగయ్య కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ధాత్రి ఫౌండేషన్ సిఇఒ డాక్టర్ స్వాతి చక్రపాణి గురువారం నాగయ్యకి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే నాగయ్యకు రెండు ఆపరేషన్లు చేయడంతో రూ.6 లక్షలకు పైగా ఖర్చయిందని, వ్యాధి ఇంకా నయం కాలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. నాగయ్యది సామాన్య రైతు కుటుంబమని, పెద్ద ఆసుపత్రిలో చికిత్స చేయించే స్తోమత ఆ కుటుంబానికి లేదని, దీంతో తిరుపతిలోని టాటా హాస్పిటల్‌లో కేన్సర్ జబ్బుకు మెరుగైన చికిత్స కలదని అవగా హన కల్పించడం జరిగిందన్నారు.ప్రస్తుతం నాగయ్యకి దాతల సహకారం అవసరం ఉందన్నారు. దాతలు ముం దుకొచ్చి 8186099919 అనే మొబైల్ నెంబరుకు ఫోన్ చేసి తమవంతు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

సంగీత కళలో ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

స్థానిక పట్టణంలో జనరల్ సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో పిల్లలకు, పెద్దలకు, అందరికీ అర్థమయ్యే రీతిలో సంగీత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రముఖ హార్మోనిస్టు, తబలిస్ట్, ఎం.సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక ప్రత్యేక సంగీత కళాకారులచే హార్మోనియం, కీబోర్డ్ (ఎలక్ట్రికల్ ఇన్స్టుమెంట్) తబలా, డోలక్, డప్పు, ప్యాడ్ (ఎలక్ట్రికల్ రిథమ్) వయోలిన్, మృదంగం, ఫ్లూట్, ఓకల్ వంటి భక్తి పాటలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సంగీతం పట్ల ఆసక్తి గలవారు 9652095734 చరవాణి ద్వారా పూర్తి సమాచారం తెలుసు కోవచ్చునని ఆయన తెలిపారు.

చెరువులో లక్ష చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి-బిరాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండలంలోని శిబ్యాల గ్రామం అలగాన్ చెరువులో గురువారం లక్ష చేప పిల్లలను మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి రైతులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేప పిల్లలను కాకినాడ, ఉభయగోదావరి జిల్లాల నుంచి తెప్పించామన్నారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధికి చేప పిల్లల పెంపకం ఎంతో తోడ్పడుతుంది అన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నా రు.

జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం

ప్రజాశక్తి-పీలేరు : జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి తెలిపారు. గురువారం పీలేరులో ఎంవిఐ అధికారిణి ఆధ్వర్యంలో జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు, వాహన డీలర్లు, డ్రైవర్లు, వ్యాపారులు, ప్రజలు స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నుండి పీలేరు క్రాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఎంవిఐ కార్యాలయంలో జరిగిన అవగాహనా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రామమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం వాహన రంగంపై ఉన్న పన్ను భారాన్ని తగ్గించడం ద్వారా జిఎస్‌టి సడలింపులు చేయడం, డ్రైవర్లు, చిన్న వ్యాపారుల జీవనోపాధికి ఊతమిస్తోందని అన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. విజయ కుమారి మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపుతో వాహనాల రిజిస్ట్రేషన్, బీమా తదితర వ్యయాలు తగ్గుతా యని, ప్రజలు చట్టబద్ధంగా వాహనాలు నడపడం ద్వారా రోడ్డు భద్రతను కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకర్, జిఎస్‌టి ఆఫీసర్ శివయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొస్తున్న ఆర్థిక సడలింపులను ప్రజలు సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ టీం సభ్యులు చందన జ్యోతి, సివిఎపియు బృంద సభ్యులు శ్వేత, స్వాతి, విష్ణు ప్రియ, లీల, బిస్మిల్లా ఆటోయూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోధసావలి, జిల్లా ఉపాధ్యక్షులు మూడే రమణనాయక్ పాల్గొన్నారు.



జిఎస్‌టిపై అవగాహన కల్పిస్తున్న పురం రామమూర్తి


మాట్లాడుతున్న వంగిమల్ల హరినాథ్

నేడు ఎంఆర్‌పిఎస్ ధర్నా

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రాల్లో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ధర్నా కార్యక్రమాలు విజయవంతం చేయాలని కలకడ మండల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు వంగిమళ్ళ హరినాథ్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రమైన కలకడలో గురువారం ఆయన విలేకరుల సమావేశం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.ఆర్.గవాయ్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానంలోనే న్యాయవాది ప్రశాంత్‌కిషోర్ బూటుతో ప్రత్యక్ష దాడి చేయటాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి వినతిపత్రం ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కె.విపల్లి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి మండల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట జరిగే నిరసన ధర్నా కార్యక్రమానికి ఆయా మండలాల పరిధిలోని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి,అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ముదివేటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విశ్వనాధ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 122 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పట్టణంలోని స్థానిక శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఎపి స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 122 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు వైవియూ డీన్, సిడిసి ప్రొఫెసర్ కె.రఘుబాబు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు దాదాపు 286 అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 122మంది అభ్యర్థులు ఎంపిక య్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి స్కిల్ డెవలప్మెంట్ ఈ విధంగా జాబ్ మేళా నిర్వహించడం నిరుద్యోగ యువతకు గొప్ప సదవకాశమని తెలిపారు. ప్రిన్సిపల్ ఎం.పెంచలయ్య మాట్లాడుతూ అందరూ అన్నీ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరై విజయవంతంగా ఉద్యోగాలకు ఎంపిక కావాలని ఆకాంక్షిం చారు.స్కిల్ డెవలప్మెంట్ అదనపు నైపుణ్య అభివృద్ధి అధికారి అరీఫ్ మాట్లాడుతూ జాబ్ మేళాలో 12 కంపెనీలకు పైగా హాజయ్యారని, ఇలాంటి సదావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీనివాసులు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్. సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘుబాబు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కోన పంచాయితీ కోన బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు స్థానికుల తెలిపారు. కోన బస్టాండ్ నుండి ద్విచక్ర వాహనంలో నంద్యాల జిల్లా అహోబిలంకు చెందిన మల్లికార్జున, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూర్‌కు బుజ్జయ్య కలసి ద్విచక్ర వాహనంలో వస్తుండగా, కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డులో నుంచి బస్టాండుకు వస్తున్న కారు ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మల్లికార్జునకు కాలు విరుగగా, బుజ్జయ్యకు తలకు బలమైన రక్త గాయాలైనట్లు 108 సిబ్బంది శ్రీనివాసులు, వెంకటాచలపతి తెలిపారు. 108వాహనంలో రాయచోటికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కారు ఢీకొని మహిళకు..

మదనపల్లె అర్బన్: కారు ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. సిటిఎం రోడ్ ఆరోగ్యవరం, తురకపల్లి దర్గాలో రాత్రి ఉరుసు ఉత్సవం జరుగుతోంది. ఉరుసు ఉత్సవాన్ని తిలకించేందుకు స్థానికంగా ఉంటున్న గౌసియా దర్గా దగ్గరికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అటు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి శ్రీకాంత్ అదృశ్యం..విషాదాంతం

ప్రజాశక్తి:మదనపల్లె అర్బన్


శ్రీకాంత్(ఫైల్ ఫొటో)

మదనపల్లెలో వ్యాపారి శ్రీకాంత్ అదృశ్యం మిస్టరీ వీడకపోవడంతో కథ కంచికేనా అని ఆరోపణలు వెల్లువెత్తాయి. మదనపల్లె కమ్మగడ్డవీధి ఎక్స్ టెన్షన్‌లో నివాసముంటున్న శ్రీకాంత్(50) స్థానిక చిత్తూరు బస్టాండ్ లో గాయత్రి మెడికల్ స్టోర్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాపార నిమిత్తం అప్పులు ఎక్కువైన నేపథ్యంలో ఒత్తిడి భరించలేక పోతున్నాను.. అమ్మను బాగా చూసుకోండని తన ఇద్దరు కుమారుల సెల్ ఫోన్లకు మెసేజ్‌లు పెట్టి సెప్టెంబర్ 27న షాప్‌ను మూసేసి వెళ్లిపోయాడు. బెంగళూరు రోడ్డు, చిప్పిలి హంద్రీనీవా కాలువ పక్కన తన బైక్‌ను వదిలి అదృశ్య మయ్యాడు. నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అగ్నిమాపక అధికారులు శ్రీకాంత్ మృతదేహం కోసం హంద్రీనీవా కాలువలో గాలింపు చేపట్టినా ఫలితం దక్కలేదు. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, ఈడిగపల్లి యాతాలవంకలో గురువారం శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తుపట్టారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేనేత మగ్గాల యజమాని వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రాయచోటి మండలం, పెద్దకోడివాండ్లపల్లికి చెందిన రాజశేఖర్, నాగవేణి దంపతులు. ఆరేళ్ల క్రితం కురబలకోట మండలంలోని చేనేత నగర్‌లో ఉంటున్న లోకేశ్వర్ రెడ్డి వద్ద కూలిమగ్గాలు నేసేందుకు వచ్చారు. అడ్వాన్స్‌గా రూ.1.60లక్షలు తీసుకు న్నారు. ఆరేళ్లుగా దంపతులిద్దరూ మగ్గాలు నేస్తూ ప్రతీవారం రూ.10వేలు జమ చేస్తూ వచ్చారు. అయినా అప్పు తీరలేదని యజమాని వేధింపులకు గురి చేయడం, బయట పనులకు వెళ్లనీయకుండా నిర్బంధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగవేణి ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాదితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.